## సెపక్‌తక్రా జిల్లా జట్ల ఎంపిక

**ఒంగోలు టౌన్, ఆగస్టు 28, ప్రభాతవార్త**



జిల్లా సెపక్‌తక్రా అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరీక్లబ్ ఇండోర్ స్టేడియంలో జిల్లా స్థాయి సబ్ జూనియర్, సీనియర్ కేటగిరీలలో ఎంపిక పోటీలు నిర్వహించారు. పర్యవేక్షకులుగా జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి బొడ్డు సుబ్బారావు, రగ్బీ కార్యదర్శి చంద్రశేఖర్ వ్యవహరించారు. సబ్ జూనియర్ బాలుర విభాగంలో గురుశేఖర్, అజయ్‌కుమార్, శివకృష్ణ, రేవంత్, మనోజ్ నాయక్, బాలికల విభాగంలో సుప్రజ, బ్రాహ్మణి, హర్షిణి, కవిత, సాయిశృతి, సీనియర్ పురుషుల విభాగంలో అశోక్, మధు, దాస్, జాకోబ్, నవీన్, మహిళల విభాగంలో మధులత, శివాని, దీపిక, సుమన, శ్రీలక్ష్మి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా సెపక్‌తక్రా అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణసాయి, రవిప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులు సెప్టెంబర్ 10-12 తేదీలలో పశ్చిమగోదావరి జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు.

## నాగభైరవ సాహిత్య పురస్కార ప్రదానోత్సవం

**ఒంగోలు టౌన్, ఆగస్టు 28, ప్రభాతవార్త**



నాగభైరవ సాహిత్యపీఠం ఆధ్వర్యంలో మల్లయ్యలింగం భవనంలో నాగభైరవ సాహిత్య పురస్కార ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. తొలుత డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ తన ప్రసంగంలో డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావు జీవిత విశేషాలు, సాహితీ కృషి, ఆయన పేరిట ఏర్పాటైన సాహిత్యపీఠం ఉద్దేశాలను వివరించారు. సాహిత్యపీఠం చేపట్టిన కార్యక్రమాలను టి అరుణ వివరించగా, డాక్టర్ నాగభైరవ రచించిన జిల్లా గేతాన్ని విద్యార్థులు ఆలపించారు. సభకు అధ్యక్షత వహించిన డాక్టర్ కందిమళ్ళ సాంబశివరావు మాట్లాడుతూ తెలుగు సాహిత్యానికి వన్నె తెచ్చిన డాక్టర్ నాగభైరవ ఆదర్శాలను నేటి తరం కొనసాగించాలన్నారు. ముఖ్య అతిధిగా పాల్గొన్న డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు తన ప్రసంగంలో డాక్టర్ నాగభైరవ రచనా రీతిని ప్రముఖంగా ప్రస్తావించారు. ఆహుతుల హర్షధ్వానాల మధ్య నాగభైరవ సాహిత్య పురస్కారాన్ని పారుపల్లి కోదండరామయ్య, డాక్టర్ గుమ్మా సాంబశివరావు, నాగభైరవ కళా పురస్కారాన్ని గోపి, నాగభైరవ ఆత్మీయ పురస్కారాన్ని డాక్టర్ నూనె అంకమ్మరావు ప్రదానం చేశారు. నాగభైరవ సాహిత్య పురస్కార గ్రంధాల విశిష్టతను డాక్టర్ బీరం సుందరరావు వివరించారు. సభలో గుళ్ళాపల్లి సుబ్బారావు, జక్కంపల్లి సీతారామారావు, చుండి వెంకన్న, నాగభైరవ ఆంజనేయులు, కెఎస్‌వి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ బహుజన అభ్యర్ధిగా వీరభద్రాచారి

**ఒంగోలు టౌన్, ఆగస్టు 28, ప్రభాతవార్త**



చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ బహుజన అభ్యర్ధిగా జి వీరభద్రాచారిని నిలపాలని బహుజన రాజ్యాధికార వేదిక ఏకగ్రీవంగా తీర్మానించింది. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బిఎస్‌పి జిల్లా అధ్యక్షులు తాటిపర్తి వెంకటస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ పంచాయతీ రాజ్ వ్యవస్థపై పట్టు కలిగి నిరంతరం ప్రజా సేవలో ఉన్న విద్యావంతులు వీరభద్రాచారి ఎమ్మెల్సీగా ఎన్నికైతే బహుజనులకు మేలు జరుగుతుందని, పట్టభద్రులు ఓటు నమోదు చేసుకొని వీరభద్రాచారి గెలుపుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో దళిత బహుజన నేతలు నీలం నాగేంద్ర, తన్నీరు ఆంజనేయులు, ధరణికోట లక్ష్మీనారాయణ, నత్తల వీరాంజనేయులు, బంకా చిరంజీవి, అజీజ్, మీరా మొహిద్దిన్, చావలి సుధాకర్, మిరియం శ్రీనివాసులు, సుతారం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న విహెచ్‌పిఎస్ దీక్షలు

**ఒంగోలు టౌన్, ఆగస్టు 28, ప్రభాతవార్త**




పెన్షన్ పెంచాలని డిమాండ్ చేస్తూ వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారంతో మూడవ రోజుకు చేరాయి. విహెచ్‌పిఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు ఆనాల సురేష్ జెండాను ఎగురవేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ దివ్యాంగుల ఇబ్బందులు కళ్ళారా చూసిన మహాజన నేత మంద కృష్ణ విహెచ్‌పిఎస్ స్థాపించి హక్కుల సాధనకై దిశా నిర్దేశం చేశారని, 15 ఏళ్ళ ఉద్యమ చరిత్రలో విహెచ్‌పిఎస్ ఎన్నో విజయాలు సాధించిందన్నారు. విహెచ్‌పిఎస్ పోరాట ఫలితంగా దివ్యాంగుల పెన్షన్ రూ. 3వేలకు పెరిగిందని, కరోనా కష్టాల నుండి దివ్యాంగులు బయటపడలేదన్న వైనాన్ని, నిత్యవసర వస్తువుల ధరల పెరుగుదల దృష్టిలో ఉంచుకొని పెన్షన్‌ను రూ. 6వేలకు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. తొలగించిన 95 వేల పెన్షన్‌లు పునరుద్ధరించే వరకు ఉద్యమం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో విహెచ్‌పిఎస్ నేతలు జొన్న బాలాజీ, రాము, సురేష్, యశోద, పద్మ, సులోచన, మహాలక్ష్మి, భారతి, ఉలిచి కోటేశ్వరరావు, శ్రీను, సురేష్, మహేష్, ప్రసాద్, ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌ఎఫ్ నేతలు పాల్గొన్నారు.

## సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక

**ఒంగోలు టౌన్, ఆగస్టు 28, ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రకాశం, బాపట్ల, నెల్లూరు, పల్నాడు జిల్లాల సర్వసభ్య సమావేశం స్థానిక ప్రభుత్వ డ్రైవర్ల సంఘం భవనంలో రాష్ట్ర అడహాక్ జనరల్ సెక్రటరీ వి అర్లయ్య అధ్యక్షతన జరిగింది. సంఘం ప్రకాశం జిల్లా అధ్యక్షునిగా అద్దంకి శ్రీనివాస్, ఉపాధ్యక్షునిగా కొణికి వెంకటేష్, కార్యదర్శిగా జి బ్రహ్మయ్య, సంయుక్త కార్యదర్శిగా ఎన్ చంద్రమౌళి, కోశాధికారిగా బి శరణ్య, నలుగురు ఇసి సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముఖ్యఅతిధిగా పాల్గొన్న ఎపిజెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు హెల్త్‌కార్డు మంజూరు చేయాలని, జాబ్‌చార్ట్ ప్రకారం విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని, ప్రొబేషన్ కాకముందు మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించి, కారుణ్య నియామకం చేయాలని, మహిళా సంరక్షణ కార్యదర్శులకు విధులలో వెసులుబాటు కల్పించాలని, ఉద్యోగుల బదిలీలు తక్షణమే చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరామన్నారు. సమావేశంలో ఎపిజెఎసి కో-ఛైర్మన్ ఆల్ఫ్రెడ్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణమోహన్, వెంకటేశ్వరరెడ్డి, పిఆర్ ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సంగీతరావు పాల్గొన్నారు.



# ప్రకాశం



తెలుగు జాతీయ దినపత్రిక వార్త

## వాసవి డిగ్రీ విద్యార్థినికి బంగారు పతకం

**కంభం, ఆగస్టు 28, ప్రభాతవార్త**

కంభంలోని వాసవి డిగ్రీ కళాశాల యందు ద్వితీయ సంవత్సరం చదువుతున్న బొట్ల రంగ ఝూన్సీ చౌదరి ఈనెల 26, 27, 28వ తేదీలలో రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ నందు జరిగిన 400 మీటర్ల హార్డిల్స్ నందు బంగారు పతకం సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ కూనా రాము తెలియజేశారు. పెద్దనల్లకాల్వకు చెందిన బొట్ల రంగ నాయకులు, గాలెమ్మల తృతీయ పుత్రిక అయిన ఝూన్సీ గతంలో 55రాష్ట్రస్థాయి, 3 జాతీయ స్థాయి పతకాలు సాధించింది. ఇంతటి విజయాన్ని సాధించిన విద్యార్థినికి, వారి తల్లిదండ్రులకు కళాశాల కరస్పాండెంట్ గొళ్ళ సుబ్బరత్నం (బాబు) అభినందనలు తెలియజేశారు.



# వెలిగొండ ప్రాజెక్టు మళ్లీ ఏడాదికి వాయిదా







**పెద్దదోర్నాల, ఆగస్టు 28, ప్రభాతవార్త**

వెలిగొండ ప్రాజెక్టు రాజకీయ నాయకులకు ఓట్ల బ్యాంకుగా మారింది అనుటలో అతిశయోక్తి లేదు. 1996లో శంకుస్థాపన అయిన వెలిగొండ ప్రాజెక్టు ఈ 26సంవత్సరాలలో ఒరిగింది శూన్యమని కేవలం రైతులకు ఆశల పల్లకిగానే మిగిలిందని మేధావులు చెప్పుకుంటున్నారు. ఏటికేడు వెలిగొండ ప్రాజెక్టుపై వరాలజల్లులు కురుస్తున్నాయి. కానీ రైతులు మాత్రం పాలకుల హామీలతో అలవాటుపడి ఇది షరా మాములే అంటూ ఓపిక నశించి వచ్చే ఎన్నికల్లో తమ సత్తా చాటుతామని చర్చించుకుంటున్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పాదయాత్ర చేసి తాను అధికారంలోకి వస్తే ఏడాదిలోగా ప్రాజెక్టు పూర్తి చేసి నీరు అందిస్తానని హామీ ఇచ్చారు. జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చి మూడేళ్లు పూర్తి చేసుకుని నాలుగు సంవత్సరంలోకి అడుగిడిన వెలిగొండ ప్రాజెక్టుపై ఇచ్చిన మామీ నెరవేరలేదు. 2022 సెప్టెంబరు నాటికి మొదటి సొరంగం ద్వారా సాగునీరు ఇస్తామని ప్రకటించి మొదటి సొరంగం పూర్తి చేసుకున్నప్పటికీ నీరు ఇవ్వలేకపోయారు. సాగునీరు ఇవ్వాలంటే ముంపు గ్రామాలు ఎత్తివేయాలి. ముంపు గ్రామాల ఎత్తివేయాలి అంటే నష్టపరిహారం అందజేయాలి. ఇది హామీల ప్రకారం కార్యాచరణలో అమలు కాకపోవడంతో మొదటి సొరంగం ద్వారా కూడా నీళ్ల ఇవ్వలేకపోయారు. రాజు తలుచుకుంటే దెబ్బలకు కొదవా అన్న చందంగా తెలుగుదేశం ప్రభుత్వ పాలనలో తవ్వకం మిగిలించిన మూడు కిలోమీటర్లు మొదటి సొరంగం మూడు నెలల్లోనే తవ్వకం పూర్తి చేసి సిద్ధం చేశారు. ముఖ్యమంత్రి తలచుకుంటే ఇలవేను సిద్ధమవుతోంది. మరి రెండో సొరంగం ఎందుకు పూర్తి చేయలేకపోయారు..? ఇందులో మతలబు ఏమిటి..? రోజుకు ఎంత కొలతలతో సొరంగం తవ్వుతున్నారు. ఎక్కడ లోపము..? కాంట్రాక్టరా..? ఇంజనీర్లా..? ప్రభుత్వమా..? బడ్జెట్ లేకపోవడం వలనా..? ఇత్యాది ప్రశ్నలు సామాన్యుడి మెదడులో సైతం కదలాడుతున్నాయి. ప్రస్తుతం టన్నల్ బోరింగ్ మిషన్‌తో పనులు జరగడం లేదు. మ్యానువల్ గానే పనులు కొనసాగుతున్నాయి. మరి వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయడానికి మరి ఎందుకు ఆలస్యమో పాలకులే చెప్పాలి. మొన్న చీమకుర్తి పర్యటనలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా ప్రజలకు మళ్లీ హామీ ఇచ్చారు. 2023 సెప్టెంబరు నాటికి వెలిగొండ పూర్తి చేసి ఎన్నకలకు వస్తామని హామీ ఇచ్చారు. ఈ హామీని రైతులు చివరిసారిగా గట్టిగా పట్టుకుని చర్చించుకుంటున్నారు. 2023 సెప్టెంబరు నాటికి ఇకసాకులు చెప్పకుండా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు వెలిగొండ పూర్తి చేస్తే సరే సరి. లేదంటే ఓటు అనే ఆయుధంతో 2024 ఎలక్షన్లలో బుద్ధి చెబుతామని బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. ఈ ఆవేదన ఎందుకు కలిగిందంటే 1986లో నాటి ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీ రామారావు వెలిగొండ ప్రాజెక్టుకు సర్వే చేయించారు. ఆ తర్వాత 1996లో నాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశాడు. తదుపరి అధికారంలోకి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణ పనులు వేగవంతం చేశారు. సాంకేతిక కారణాలు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వెరసి జాప్యం జరిగింది. 2018 సంక్రాంతి నాటికి వెలిగొండ పూర్తి చేసి సాగునీరు ఇస్తామని నాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇవ్వలేకపోయారు. తదుపరి అధికారంలోకి వచ్చినా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏడాదిలోగా పూర్తి చేసి నీరు ఇస్తానన్నాడు. అధికారంలోకి వచ్చినా ఏడాదిలో నీళ్ల ఇవ్వలేకపోయారు. ఇచ్చిన హామీలను నెరవేర్చాలని పోయారని ప్రతిపక్షాలు అంటున్నారు. 2022 సెప్టెంబరు నాటికి మొదటి సొరంగం ద్వారా నీళ్ల ఇస్తామని చెప్పిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆ పని చేయలేకపోయారు. మళ్లీ మొన్న చీమకుర్తి పర్యటనలో 2023 సెప్టెంబరు నాటికి రెండో సొరంగం కూడా పూర్తి చేసి ఒకేసారి నీళ్ళిచ్చి ఎన్నికలకు వస్తామని మరో ఏడాది వాయిదా వేశారు. దీంతో ఏటికేడు వాయిదాలతో వెలిగొండ ప్రాజెక్టు వరలాజల్లులతో నిండిందే తప్ప రైతాంగానికి జలాలు అందింది ఏమి లేదని నిరాశనిస్పృహాలతో రైతులు ఉన్నారు. 1996 నుండి అనాగా ఈ ఏడాదితో 26సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న రైతాంగ ఆశలు నెరవేరుతాయని ఆశిద్దాం. వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసి వస్తే జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు మళ్లీ బ్రహ్మరథం పడతారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయకుండా మళ్లీ కల్లబొల్లి కబుర్లతో ఎన్నికలకు వస్తే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి బుద్ది చెప్పేందుకు సిద్దంగా ఉన్నారు.

# మామూళ్ల మత్తులో విద్యాశాఖ




- అధికారులకు ఆదాయమార్గంగా ప్రవేటు పాఠశాలలు
- గుర్తింపు ఒక చోట, పాఠశాల నిర్వహణ ఒక చోట
- నిబంధనలకు నీళ్లు వదిలి పాఠశాలలకు పర్మిషన్
- అన్నీ తానై చక్రం తిప్పుతున్న చిరుద్యోగి
- ఒకే భవనంలో రెండు, మూడు విద్యాసంస్థలకు పర్మిషన్
- రివర్షన్ రిటైర్‌మెంట్, పదోన్నతి, డిప్యుటేషన్ మామూళ్లకు కాదేది అనర్హం

**ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 28, ప్రభాతవార్త**

జిల్లా విద్యాశాఖలో యదేచ్ఛగా మామూళ్లపర్వం మూడు పువ్వులు, ఆరుకాయలుగా సాగుతుంది. రాష్ట్ర ప్రభుత్వం నూతన విద్యావిధానంతో కీలక మార్పులకు శ్రీకారం చుట్టి విద్యాభివృద్ధికి కృషి చేస్తుంటే అధికారుల తీరు అందుకు భిన్నంగా ఉంది. గతంలో అనేక పర్యాయాలు అవినీతి నిరోదక శాఖ దాడులు నిర్వహించి కేసులు నమోదు చేసిన మామూళ్ల దందా ఉధృతమైందే తప్ప తగ్గలేదు. మామూళ్ల జాడ్యం ప్రవేటు పాఠశాలలతో పాటు ప్రభుత్వ ఉపాధ్యాయులను పట్టి పీడిస్తుంది. అధికారులకు ఆదాయ మార్గంగా ప్రవేటు పాఠశాలలు కనిపిస్తున్నాయి. దీంతో నిబంధనలకు నీళ్ల వదిలి ప్రవేటు పాఠశాలలకు అక్రమంగా అనుమతులు ఇస్తున్నారు. పాఠశాల గుర్తింపు ఒక చోట తీసుకొని, మరో చోట పాఠశాలను నడుపుతున్నప్పటికీ అధికారులు చూసి చూడనట్లు ఉంటున్నారు. నగరంలో పదికి పైగా పాఠశాలలు అక్రమంగా నడుస్తున్న అధికారులు చోద్యం చూస్తున్నారు. ఈ మధ నగరంలోని గోరంట్ల కాంప్లెక్స్ సమీపంలో బిఇడి కాలేజీ ప్రాంగణంలో ఒక కార్పోరేట్ పాఠశాల నిబంధనలకు విరుద్ధంగా పర్మిషన్ ఇవ్వడంలో అధికారులకు లక్షల్లో ముట్టినట్లు ప్రచారం జరుగుతుంది. గుర్తింపు పొందిన చోట కాకుండా మరో చోట నిర్వహిస్తున్న పాఠశాలల యాజమాన్యాలు అధికారులకు స్థాయిని బట్టి ముట్టజెప్పారు అన్నది బహిరంగ రహస్యం. అంతే కాకుండా మామూళ్లు ఇస్తే చిన్న బిల్డింగ్ లేక రేకుల షెడ్డు అయినా పర్మిషన్ ఇవ్వడంలో విద్యాశాఖ అధికారులకు ఎవరూ సాటిరారు. హైస్కూల్ పర్మిషన్‌కు కనీసం 18 రూములు ఉండాల్సి ఉండగా నాలుగు రూములు ఉన్నా పర్మిషన్ ఎలా ఇచ్చారో అర్ధం కాని ప్రశ్న ? కొన్ని పాఠశాలలు ఒక చోట పొందిన పర్మిషన్‌తో రెండు లేక మూడు చోట్ల బ్రాంచీలుగా స్కూల్స్ నిర్వహిస్తున్నా అధికారులు అటు వైపు కన్నెత్తి చూడటం లేదు. పాఠశాలకు ఆటస్థలం ఎండమావిలో నీటి చందంగా మారింది. ఏ పాఠశాలకు ఆట స్థలంలేదు. నగరంలో 80కు పైగా పాఠశాలలు ఉండగా ఆట స్థలం ఉన్న పాఠశాలలు 10 కూడా లేవన్నది నిజం. జిల్లా కార్యాలయంలో ఏ పని కావాలన్నా చిరుద్యోగి ఆమోదం అవసరం. లేదంటే ఏ పనీ కాదు. కార్యాలయంలో అన్నీ తానై చక్రం తిప్పడంతో పాటు మామూళ్ల రేటు ఏ సీటుకు ఎంతో ఇవ్వాలో అతనే నిర్ణయిస్తాడంటే అవినీతి ఏ స్థాయిలో జరుగుతుందో అర్ధమౌతుంది. ఒకే భవనంలో రెండూ లేక మూడు విద్యాసంస్థలకు ఎలా పర్మిషన్ వచ్చిందో అధికారులకే తెలియాలి. ప్రవేటు పాఠశాలల యాజమాన్యాలకే కాకుండా ప్రభుత్వ ఉపాధ్యాయలకు మామూళ్ల బెడద తప్పడంలేదు. రివర్షన్, రిటైర్‌మెంట్, పదోన్నతి, డిప్యుటేషన్ పేరు ఏదైనా మామూళ్లకు కాదేది అనర్హం. ప్రభుత్వ ఉపాధ్యాయులు మామూళ్లు ఇవ్వలేక ఎవ్వరికీ చెప్పుకోలేక నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు, అవినీతి నిరోదకశాఖ అధికారులు దృష్టి సారించి జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సాగుతున్న మామూళ్ల దందాను అరికట్టాల్సి ఉంది.

**డిఇఓ వివరణ :**

పాఠశాల గుర్తింపు ఒక చోట పొంది మరొక చోట నిర్వహిస్తుంటే వాటిని గుర్తించి నోటీసులు అందజేసి చర్యలు తీసుకుంటాము.

# బాషను సంస్కృతిని కాపాడుకోవాల్సిన అవశ్యకత అందరిపై ఉంది









- అవార్డు పంపిణీ సభలో చిన వీర భద్రుడు ఉద్ఘాటన

**అద్దంకి, ఆగస్టు, 28 ప్రభాతవార్త**

మన తెలుగు బాషను సంస్కృతిని పరిరక్షించుకోవాల్సిన అవశ్యకత ఎంతైనా వుందని, పాఠశాల విద్యాశాఖ మాజీ డైరెక్టర్, రిటైర్డు ఐఎఎస్ అధికారి వాడరేవు చినవీర భద్రుడు అన్నారు. ఆదివారం అద్దంకిలో తనకు అవార్డు అందజేసే సందర్భంగా నిర్వహించిన సభలో వాడరేవు చిన వీరభద్రుడు మాట్లాడారు. ఎఱ్ఱన వంటి మహాకవులు, నడయాడిన నేలపై తాను అవార్డు అందుకోవడం అంటే ఇది గొప్ప అనుభూతి అని, ఆయన అన్నారు. బాషను సంస్కృతిని కాపాడు కోవాలని ఆయన ఈ సందర్భంగా అన్నారు. మహానీయుల తీపి గుర్తులను, పదిల పరుచుకోవాలని, అద్దంకి గడ్డపై మొదట పద్యం పుట్టడమంటే అద్దంకి గడ్డ చరిత్ర పుటలనుండి ఎన్నటికీ తొలగిపోని చారిత్రఘట్టం అని ఆయన అన్నారు. తొలి తెలుగు పద్యం, నమూనను, ఎఱ్ఱనలాంటి మహాను భావుల, విగ్రహాలను, ప్రతిష్టించు కోవడం అద్దంకి గడ్డకు ఆ ప్రతిష్ట దక్కడం ఎంతో అదృష్టం అన్నారు. చారిత్రిక ఘట్టాలను పదిల పరుచుకునే అంశంలో కూడ, ప్రతి ఒక్కరు భాధ్యత వహించాలని వాడరేవు చిన వీర భద్రుడు అన్నారు. ఈ సభలో అతిధులుగా పాల్గొన్న విద్యాశాఖ జిల్లా అధికారి విజయభాస్కర్ మాట్లాడుతూ ఇటు వంటి చారిత్రకమైన కార్యక్రమాలు జరిగే సమయంల్లో చరిత్ర తెలుసుకునేందుకు, విద్యార్థినీ, విద్యార్థులను కూడ, భాగస్వామ్యంలను చేయాలని ఆయన సూచించారు. వాడరేవు చిన వీర భద్రుడు వ్రాసిన కావ్యం, నీటి రంగులును స్వరాజ్య పద్మజ, సభకు పరిచయం చేశారు. పాఠ్యపుస్తకాల డైరెక్టర్ రవీంద్రరెడ్డి మాట్లాడుతూ కవి, అనువాదకుడు, మాతృబాష, ఆరాధకుడైన చినవీర భద్రుడుకి అద్దంకిలో పురస్కారం ఇవ్వడం, ఆయన ఈ పురస్కారాన్ని అందుకోవడం, సముచితమే, అని అన్నారు. ఒంటేరు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ అద్దంకిలో తొలిపద్య శాసనం ప్రతిష్టం చడం, అద్దంకి పట్టణానికే బాషాపరంగా, గౌరవం పెరిగిందని అన్నారు. రెడ్డిరాజుల రాజధాని అయిన అద్దంకి పట్టణంలో పుట్టం రాజు బుల్లియ్య, రామలక్ష్మమ్మల చారిటబుల్ ట్రస్టును ఏర్పాటు చేసి ట్రస్టుద్వారా, తెలుగుబాష, సంస్కృతికి, చారిత్రక విషయాలపై అవార్డులు ప్రధానం చేయడం అందుకు పుట్టంరాజు శ్రీరామచంద్ర మూర్తిని అభినందించాలని వక్తలు అన్నారు. ముందుగా చిన వీరభద్రునికి పూర్ణకుంభంతో శతావధాని నారాయణం బాలసుబ్రమణ్యం, వేదమంత్రోచ్ఛారణతో స్వాగతం పలికారు. అనంతరం వాడరేవు చిన వీరభద్రుడుకి పురస్కారాన్ని అందజేస్తూ 10వేలరూపాయలతోపాటు శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించి, ప్రశంసాపత్రాన్ని అతిథులు అందజేశారు. ఈ కార్యక్రమానికి సభాఆహ్వానం పుట్టంరాజు, చక్రధర్ పలకగా, ఈ సభకు పుట్టంరాజు శ్రీరామచంద్ర మూర్తి అధ్యక్షత వహించగా, స్థానిక రామసుశీల నిలయంలో సభా కార్యక్రమం జరిగింది. ఈ సభలో డివిఎం సత్యనారాయణ, డాక్టర్ యు. దేవపాలన, జ్యోతి చంద్రమౌళి, లక్కరాజు శ్రీనివాసరావు, వీరవల్లి రుద్రయ్య, నంబూరి హనుమంత రావు, బాలభార్గవి, కాళీ ప్రసన్న., కుందుర్తి ఆనంతరామకృష్ణ, చుండూరి మురళీసుధాకర్, అన్నమనేని వెంకటరావు, మోటుపల్లి రామదాసు, ఉపాధ్యాయులు మస్తాన్, నాగేశ్వరరావు, మారం రామకోటేశ్వరరావు, మహ్మాద్‌రఫీ, ధర్మవరపు సీతారామాయ్య, పువ్వాడ రామకోటేశ్వరావు, న్యాయ వాది రమేష్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. చివరిగా కమతేశ్వర దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన తొలి తెలుగు పద్య శాసన పద్య నమూనాన్ని, యఱ్ఱన్న, విగ్రహాలను చిన వీరభద్రుడుతోపాటు, అతిథులు అందరూ పరిశీలించి, పూలమాలలు వేశారు.



## పంటల నమోదును పరిశీలించిన ఎ.ఓ కిరణ్‌కుమార్



**మార్టూరు, ఆగస్టు 28, ప్రభాతవార్త**
మండలంలోని బొల్లాపల్లి, కొలలపూడి గ్రామాల్లో జరుగుతున్న పంటల నమోదు కార్యక్రమాన్ని మండల వ్యవసాయాధికారి వి.కిరణ్‌కుమార్ పరిశీలించారు. ఆయన రైతులతో మాట్లాడుతూ రైతులు తప్పని సరిగా సాగు చేసిన, చేస్తున్న పంటలను నమోదు చేయించుకోవాలన్నారు. ఆయా గ్రామాల్లో ఉన్న రైతు భరోసా కేంద్రాలు, లేదా ఉద్యానవనశాఖ సిబ్బందిని సంప్రదించి పంటలు నమోదు చేయించుకోవాలని సూచించారు. పంటలు నమోదు చేసుకుంటే ధాన్యం కొనుగోలు, సున్నా వడ్డీ, పంట రుణాలు, వైయస్సార్, పిఎంఎఫ్‌బివై ఉచిత పంటల బీమా, ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటలు నష్టపోతే ఇన్‌పుట్ సబ్సిడీ వర్తిస్తాయన్నారు. ఆగస్టు 31వ తేదిలోపు సాగు చేసిన, చేస్తున్న పంటలను నమోదు చేయించుకోవాలని ఆయన కోరారు. ఇప్పటికే 4వేల ఎకరాలు సాగు చేయగా, 3వేల ఎకరాలు నమోదు చేయడం జరిగిందన్నారు.

## శ్రీచైతన్య కాలేజిలో స్పోర్ట్స్ మీట్

**- విద్యార్థినీ, విద్యార్థుల నుండి విశేష స్పందనన- విజేతలకు 30న బహుమతుల పంపిణీ**




**అద్దంకి , ఆగస్టు, 28 ప్రభాతవార్త**
స్థానిక శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో వార్షిక స్పోర్ట్స్ మీట్ ఆదివారం జరిగింది. సింగరకొండలోని ఆడిటోరియంలో విద్యార్థినీ, విద్యార్థులకు వివిధ విభాగాలల్లో స్పోర్ట్స్, గెమ్స్‌లో, పోటీలను నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ మీరారెడ్డి ఆధ్వర్యంలో ఈ స్పోర్ట్స్ నిర్వహించారు. బాలుర విభాగంలో క్రికెట్, కోకో, వాలీబాల్, రన్నింగ్, బేస్‌బాల్, బాలికల విభాగంలో కోకో, కబాడీ, స్కిప్పింగ్, బేస్‌బాల్ విభాగాలలో పోటీలు నిర్వహించారు. వీటిలో బాలుర విభాగంలో క్రికెట్‌లో, బ్లూహౌస్ టీం మొదటిస్థానంలో, ఎల్లోటీం వాలీబాల్, కబాడీ విభాగాల్లో ప్రథమ స్థానం నిలిచాయి. బాలికల విభాగంలో కోకోలో బ్లూహౌస్ టీం, కబాడీలో ఎల్లో హౌస్‌టీం ప్రథమస్థానాలు సాధించాయి. విజేతలకు ఈనెల 30వ తేదిన కళాశాల ప్రాంగణలో జరిగే ఫ్రషర్స్‌డే వేడుకల సందంర్భంగా జరిగే సభా కార్యక్రమంలో అతిథిలచే బహుమతులు అందజేయనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మీరారెడ్డి ప్రభాతవార్తకు తెలిపారు. ఈ పోటీల నిర్వహణ కార్యక్రమంలో కళాశాల ఎ.ఒ. అధ్యపక, అధ్యపకేతర సిబ్బంది, పాల్గొన్నారు.

## నేడు రోటరీ ఆధ్వర్యంలో సైకిళ్ళు, కుట్టు మిషన్ల పంపిణీ

**అద్దంకి , ఆగస్టు, 28 ప్రభాతవార్త**
రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ అద్దంకి వారి ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం 4గంటలకు కుటుమిషన్లు, సైకిళ్లను పంపిణీ చేయనున్నట్లు రోటరీ, అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి సందిరెడ్డి శ్రీనివాసరావు, చిన్ని మురళీ కృష్ణ, తమ్మన శ్రీనివాసరావులు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. శ్రీనివాస ఆర్యవైశ్య కళ్యాణమండపంలో జరిగే ఈ కార్యక్రమంలో 5 సైకిళ్లు, 5కుట్టుమిషన్లు పంపిణీ చేయనున్నట్లు వీటిని రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ నార్త్ వెల్జాన్ వారి సహాకారంతో పంపిణీ జరుగుతుందని తెలిపారు. ముఖ్య అతిథిగా ఎంపిడిఒ రాజేంద్ర, ఆత్మీయ అతిథిగా అసిస్టెంట్ గవర్నర్ గల్లా సాంబశివరావు లు పాల్గొంటారని వారి తెలిపారు.

## నేడు కృష్ణచైతన్య పర్యటన వివరాలు

**అద్దంకి , ఆగస్టు, 28 ప్రభాతవార్త**
అద్దంకి నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జి, శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య సోమవారం అద్దంకి నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఉదయం 10గంటలకు అద్దంకి పట్టణంలోని రాజీవ్‌నగర్ నందు, మండల పరిషత్ పాఠశాలలో ఫేజ్-2 నాడు నేడులో భాగంగా అదనపు తరగతి గదులకు భూమి పూజ నిర్వహించనున్నారు. అదే విధంగా రాజీవ్‌నగర్ నందు జండా చెట్టు శంఖుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారని వైఎస్ఆర్‌సిపి పార్టీ కార్యాలయ ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు.

## నేడు కొప్పరంలో గడప గడపకు మన ప్రభుత్వం

**సంతమాగులూరు , ఆగస్టు, 28 ప్రభాతవార్త**
మండలంలోని కొప్పరం గ్రామములో సోమవారం మధ్యాహ్నం 3గంటలనుండి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని అద్దంకి నియోజకవర్గ వైసిపి కార్యాలయ ప్రతనిధి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అద్దంకి నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జి, శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య పాల్గొంటారని మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నాలని ప్రకటనలో తెలిపారు.

## వ్యవసాయ రంగాన్ని కాపాడాలి



**ముండ్లమూరు, ఆగస్టు 28, ప్రభాతవార్త**
ముండ్లమూరు మండల రైతు సంఘం ప్రథమ మహాసభ ముండ్లమూరు మండలంలోని ఉల్లగల్లుగ్రామంలో గాలి వెంకటరామిరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభలో రైతు సంఘం జిల్లా నాయకులు పెంద్యాల హనుమంతరావు పాల్గొని మాట్లాడుతూ దేశం వ్యవసాయం పరిస్థితి భాగలేదన్నారు. దీనికి కారణం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు అన్నారు. వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. స్వామినాధన్ కమీషన్‌ను అమలు జరిపి పంటలకు గిట్టుబాటు ధర కల్పించి వ్యవసాయ రంగాన్ని కాపాడాలన్నారు. కానీ ప్రభుత్వాలు ఏవేమి పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం రైతు సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శి పంటా ఏడుకొండలు, అధ్యక్షులుగా గాలి వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులుగా ఉల్లగల్లు వెంకటరామిరెడ్డి, కామణి శ్రీను, దామా ఏడుకొండలు, షేక్ మీరావలి, గంగినేని సత్యనారాయణ, మేదరమెట్ల సాంబయ్య, కనగాల నాగేశ్వరరావు, కనగాల నాగేశ్వరరావు, కాటూరి రామాంజనేయులు, వలేటి వీరయ్య, అన్నపురెడ్డి ఆదినారాయణరెడ్డి పై కమిటీ సభ్యులు నూతన కమిటీగా ఏర్పడి రాబోయే కాలంలో వ్యవసాయ రంగాన్ని నిలబెట్టడం కోసం పోరాటాలు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోవింద వెంకటప్పరెడ్డి, పర్వతనేని ఆంజనేయులు పాల్గొన్నారు.

## పేకాట రాయుళ్ల అరెస్ట్-రూ.2250లు స్వాధీనం



**మార్టూరు, ఆగస్టు 28, ప్రభాతవార్త**
మండల కేంద్రమైన మార్టూరులో పేకాట ఆడుతున్న శిబిరంపై మార్టూరు పోలీసులు ఆదివారం దాడులు చేశారు. పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రూ.2250లు స్వాధీనం చేసుకున్నట్లు మార్టూరు ఎస్సై రవీంద్రారెడ్డి తెలిపారు. మండలంలో ఎవరైన చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై రవీంద్రారెడ్డి హెచ్చరించారు.

## రోడ్డు ప్రమాదంలో కార్మికుడు మృతి



**మార్టూరు, ఆగస్టు 28, ప్రభాతవార్త**
రోడ్డు ప్రమాదంలో ఒక కార్మికుడు మృతి చెందిన సంఘటన ఆదివారం జరిగింది. మండల కేంద్రమైన మార్టూరు నుండి నాగరాజుపల్లి వెళ్లే రహదారిలో వేబ్రిడ్జి వద్ద లారీ డ్రైవర్ సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ లారీనీ రివర్స్ చేస్తున్న సమయంలో కార్మికుడు లారీ కిందపడి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. అందిన సమాచారం మేరకు మార్టూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఎంఈఓ సాంబశివరావుని సన్మానించిన ఉపాధ్యాయులు



**ముండ్లమూరు, ఆగస్టు 28, ప్రభాతవార్త**
ముండ్లమూరు మండలం ఎంఈఓ ఎన్.సాంబ శివరావు ఒక సంవత్సరం కాలం ముండ్లమూరు మండలం ఉపాధ్యాయులను దిగ్విజయంగా నడిపించిన ఎన్.సాంబశివరావుకి వీడ్కోలు, చిరు సన్మానం మండల విద్యావనరుల కేంద్రంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## 8 మండలాలకు ఇన్‌చార్జి ఎం.ఇ.ఒ.ల నియామకం

**- స్కూల్ విద్యాశాఖ కమీషనర్ నుండి ఉత్తర్వులు**



**అద్దంకి , ఆగస్టు, 28 ప్రభాతవార్త**
బాపట్ల జిల్లాలో 8 మండలాలకు ఇన్‌చార్జి ఎం.ఇ.ఒలను నియమిస్తూ రాష్ట్ర స్కూల్ ఎడ్యుకేషన్ కమీషనర్ ఉత్తర్వులను జారీ చేశారు. ఆమేరకు ఆయా మండలాల ఇన్‌చార్జి ఎం.ఇ.ఒలగా, నియమించబడిన ప్రధానోపాధ్యాయులకు ఆదివారం ఉత్తర్వులు అందాయి. అద్దంకి మండల ఇన్‌చార్జి ఎం.ఇఒ.గా పి.వి. రాఘవరావును నియమించారు. ఈయన అద్దంకి పట్టణంలోని ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. ఈయనకు ఎం.ఇ.ఒ. అదనపు బాధ్యతలు, ఇక బట్టిప్రోలు మండలానికి ఎం.రమేష్‌ను నియమించారు. ఈయన గవర్నమెంటు హైస్కూల్ రేపల్లె ప్రధానోపాధ్యాయుడు. చెరుకుపల్లి మండలానికి కె. సురేష్‌ను నియమించారు. ఈయన కావూరు గవర్నమెంటు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, చీరాల మండలానికి జి.శాంతకుమారిని నియమించారు. ఈమె బాపట్లలోని ఎస్ఎన్ గవర్నమెంటు బాలికల హైస్కూల్ ప్రధానోపాధ్యారాలు, నిజాంపట్నం మండలానికి కె. మాధవరావును నియమించారు. ఈయన పివి పాలెం గవర్నమెంటు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, కొల్లూరు ఎం.ఇ.ఒ.గా ఎం.వి.నాగరత్నం, ఈమె వేమూరి గవర్నమెంటు హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలుగా పనిచేస్తున్నారు. ఇంకొల్లు ఎం.ఇ.ఒగా జి.వెంకటేశ్వర్లును నియమించారు. ఈయన గన్నవరం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. చినగంజాం ఎం.ఇ.ఒ.గా వి. వెంకటేశ్వరరావును నియమించారు. ఈయన ఆదిపూడి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయుడుగా పనిచేస్తున్నాడు. ఈ 8మండలాలకు ఎం.ఇ.ఒలుగా నియమించబడినవారు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల విధులతోపాటు అదనంగా ఆయా మండలాల ఇన్‌చార్జి ఎం.ఇ.ఒలుగా విధులు నిర్వహించాలని, ఆ ఉత్తర్వులలో పెర్కొన్నారు.

## భాషను సంస్కృతిని కాపాడుకోవాల్సిన అవశ్యకత అందరిపై వుంది

**- అవార్డు పంపిణీ సభలో చిన వీరభద్రుడు ఉద్ఘాటన**



**అద్దంకి , ఆగస్టు, 28 ప్రభాతవార్త**
మన తెలుగు బాషను సంస్కృతిని పరిరక్షించుకోవాల్సిన అవశ్యకత ఎంతైనా వుందని, పాఠశాల విద్యాశాఖ మాజీ డైరెక్టర్ , రిటైర్డు ఐఎఎస్ అధికారి వాడరేవు చినవీర భద్రుడు అన్నారు. ఆదివారం అద్దంకిలో తనకు అవార్డు అందజేసే సందర్భంగా నిర్వహించిన సభలో వాడరేవు చిన వీర భద్రుడు మాట్లాడారు. ఎఱ్ఱన వంటి మహాకవులు, నడయాడిన నేలపై తాను అవార్డు అందుకోవడం అంటే ఇది గొప్ప అనుభూతి అని, ఆయన అన్నారు. బాషను సంస్కృతిని కాపాడు కోవాలని ఆయన ఈ సందర్భంగా అన్నారు. మహానీయుల తీపి గుర్తులను, పదిల పరుచుకోవాలని, అద్దంకి గడ్డపై మొదట పద్యం పుట్టడమంటే అద్దంకి గడ్డ చరిత్ర పుటలనుండి ఎన్నటికీ తొలగిపోని చారిత్రఘట్టం అని ఆయన అన్నారు. తొలి తెలుగుపద్యం, నమూనను, ఎఱ్ఱనలాంటి మహానుభావుల, విగ్రహాలను, ప్రతిష్టించు కోవడం అద్దంకి గడ్డకు ఆ ప్రతిష్ట దక్కడం ఎంతో అదృష్టం అన్నారు. చారిత్రిక ఘట్టాలను పదిల పరుచుకునే అంశంలో కూడ, ప్రతి ఒక్కరు భాధ్యత వహించాలని వాడరేవు చిన వీర భద్రుడు అన్నారు. ఈ సభలో అతిధులుగా పాల్గొన్న విద్యాశాఖ జిల్లా అధికారి విజయభాస్కర్ మాట్లాడుతూ ఇటు వంటి చారిత్రకమైన కార్యక్రమాలు జరిగే సమయంల్లో చరిత్ర తెలుసుకునేందుకు, విద్యార్థినీ, విద్యార్థులను కూడ, భాగస్వామ్యలను చేయాలని ఆయన సూచించారు. వాడరేవు చిన వీర భద్రుడు వ్రాసిన కావ్యం, నీటి రంగులను స్వరాజ్య పద్మజ, సభకు పరిచయం చేశారు. పాఠ్యపుస్తకాల డైరెక్టర్ రవీంద్రరెడ్డి మాట్లాడుతూ కవి, అనువాదకుడు, మాతృబాష, ఆరాధకుడైన చినవీర భద్రుడుకి అద్దంకిలో పురస్కారం ఇవ్వడం, ఆయన ఈ పురస్కారాన్ని అందుకోవడం, సముచితమే, అని అన్నారు. ఒంటేరు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ అద్దంకిలో తొలిపద్య శాసనం ప్రతిష్ఠించడం, అద్దంకి పట్టణానికే బాషాపరంగా, గౌరవం పెరిగిందని అన్నారు. రెడ్డిరాజుల రాజధాని అయిన అద్దంకి పట్టణంలో పుట్టంరాజు బుల్లియ్య, రామలక్ష్మమ్మల చారిటబుల్ ట్రస్టును ఏర్పాటు చేసి ట్రస్టుద్వారా , తెలుగుబాష, సంస్కృతికి, చారిత్రక విషయాలపై అవార్డులు ప్రధానం చేయడం అందుకు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తిని అభినందించాలని వక్తలు అన్నారు. ముందుగా చిన వీరభద్రునికి పూర్ణకుంభంతో శతావధాని నారాయణం బాలసుబ్రమణ్యం, వేదమంత్రోఛారణతో స్వాగతం పలికారు. అనంతరం వాడరేవు చిన వీరభద్రుడుకి పురస్కారాన్ని అందజేస్తూ 10వేల రూపాయలతోపాటు శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించి, ప్రశంసాపత్రాన్ని అతిధులు అందజేశారు. ఈ కార్యక్రమానికి సభాఆహ్వానం పుట్టంరాజు, చక్రధర్ పలకగా, ఈ సభకు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి అధ్యక్షత వహించగా, స్థానిక రామసుశీల నిలయంలో సభాకార్యక్రమం జరిగింది. ఈ సభలో డివిఎం సత్యనారాయణ, డాక్టర్ యు. దేవపాలన, జ్యోతి చంద్రమౌళి, లక్కరాజు శ్రీనివాసరావు, వీరవల్లి రుద్రయ్య, నంబూరి హనుమంతరావు, బాలభార్గవి, కాళీ ప్రసన్న., కుందుర్తి ఆనంతరామకృష్ణ, చుండూరి మురళీసుధాకర్, అన్నమనేని వెంకటరావు, మోటుపల్లి రామదాసు, ఉపాధ్యాయులు మస్తాన్, నాగేశ్వరరావు, మారం రామకోటేశ్వరరావు, మహ్మద్‌రఫీ, ధర్మవరపు సీతారామాయ్య, పువ్వాడ రామకోటేశ్వరరావు, న్యాయవాది రమేష్,తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. చివరిగా కమలేశ్వర దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన తొలి తెలుగు పద్య శాసన పద్య నమూనాన్ని, యఱ్ఱన్న, విగ్రహాలను చిన వీరభద్రుడుతోపాటు, అతిధులు అందరూ పరిశీలించి, పూలమాలలు వేశారు.

## రావినూతలల్లో ఎటిఎంను ప్రారంభించిన చైతన్య




**కొరిశపాడు , ఆగస్టు, 28 ప్రభాతవార్త**
గ్రామీణ ప్రాంతాలలో ఎటిఎంలను ఏర్పాటు చేసి ప్రజలకు ఆర్థిక పరమైన సేవలను మరింత అందుబాటులోకి తెవడం, అభినందనీయమని అద్దంకి నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జి, శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య అన్నారు. మండలంలోని రావినూతల గ్రామములో ఆదివారం ఉదయం ఇండియావన్ ఎటిఎంను ఏర్పాటు చేయగా, దానిని కృష్ణచైతన్య ప్రారంభించారు. ప్రజలకు ఎటిఎం సేవలు గ్రామీణ ప్రాంతాలకు అందుబాటులోకి తేవడం, ఆసేవలను ప్రజలు సమయం వృదాకాకుండా, వుండే అందుకు ఇవి ఏంతో దోహదపడతాయని ఆయన అన్నారు. ముందు ఎటిఎంను ఏర్పాటు చేసిని రూమును ప్రారంభించి, ఎటిఎం మిషన్ ప్రారంభించి, లావా దేవిలా సంబంధించిన నిర్వహణను కూడ చైతన్య చేతులమీదగా నిర్వహకులు నిర్వహింపచేశారు. ఈ కార్యక్రమంలో మండల, గ్రామ, వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులు, రావినూతల గ్రామస్థులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బాదుడే బాదుడు కార్యక్రమానికి విశేష స్పందన




**జరుగుమల్లి, ఆగస్టు 28, ప్రభాతవార్త**
స్థానిక మండల కేంద్రమైన జరుగుమల్లి, పంగులూరివారిపాలెం రెండు గ్రామాల్లో బాదుడే బాదుడు కార్యక్రమంలో భాగంగా కొండపి నియోజకవర్గ ఎమ్మెల్యే డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి, యువనాయకులు దామచర్ల సత్య, మండలంలోని టీడీపీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని ముందుగా ఉల్లేరమ్మ తల్లి అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి మాట్లాడుతూ నవరత్నాలు అని పేరు పెట్టి విచ్చలవిడిగా ప్రచారంతో ప్రజలను మోసం చేయడం తప్పితే ప్రజలకు ఒరిగింది శూన్యమని, ఒక వేళ పెద్దలకు వర్తించే పథకాలను సాంకేతిక సాకులతో కాలయాపన చేసుకుంటూ ఎగ్గొట్టడం తప్ప ప్రజలకు జరిగిన మేలు ఏమి లేదన్నారు. ఇందంతా ప్రజలు గమనిస్తున్నారని దుయ్యబట్టారు. ఎస్సీ,ఎస్టీ,బీసీలకు కార్పోరేషన్ల ద్వారా ఇచ్చే బ్యాంకు రుణాలను ఎవరికైనా ఇస్తున్నారా భూమి కొనుగోలు పథకం ద్వారా పేదలకు భూములు పంపిణీ చేశారా, ముస్లిం ఆడ బిడ్డలకు ఇచ్చే దుల్హాన్ పథకం రద్దు విదేశీ విద్య రద్దు ఎస్సీ,ఎస్టీ రుణాలు రద్దు రద్దుల ప్రభుత్వంగా మారిందన్నారు. ముందు ఒక్కసారి ఛాన్స్ ఇవ్వండి అని ప్రజలను నమ్మబలికి ఆ తరువాత అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వంలో ఉన్న పథకాలను రద్దు చేసి ఈ పథకాలకు పేర్లు మార్పు చేసి వాటికి కూడా సాంకేతిక ఇబ్బందులు సృష్టించి అర్హులైన పేదలకు అవి వర్తించకుండా ఎలా ఇబ్బంది పెడుతున్నారో ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. జగనన్న గృహాల పేరుతో ఎక్కడో ఊరికి దూరంగా కొండలు, వాగులు, వంకలు ఉండే ప్రాంతంలో విసిరేసినట్లుగా చాలీచాలని లేఅవుట్ వేసి ప్రజలు అవి తీసుకోకుండానే వారి కన్ను వారి వేలుతోనే పొడుస్తున్నట్లు చేస్తున్నారన్నారని అన్నారు. మండల సీనియర్ నాయకులు దగ్గుమాటి సుబ్బారెడ్డి, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పోకూరి రవీంద్రబాబు, జిల్లా రైతు ఉపాధ్యక్షులు పోటు పెద్దబాబు, జిల్లా అధికార ప్రతినిధి వేముల విజయనిర్మల, మండల ప్రధాన కార్యదర్శి నరాల సోమయ్య, కొండూరి బలరాంరెడ్డి, రామచంద్రారెడ్డి, ఏలూరి రాంబాబు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు జి.ప్రభుదాసు, సుబ్బారెడ్డి, కోనూరి సుబ్బారావు, మక్కిన శ్రీనివాసరావు, ఆర్.శేషయ్య, పూర్ణవట్టి గుంట శివాజి, కొండలరావు, వెంకటేశ్వర్లు, చదలవాడ బ్రహ్మేంద్రం, నల్లమోతు వెంకటేశ్వర్లు, దీప్ చంద్, శ్రీను, ఆముదాలపల్లి శ్రీను, కొమ్మాలపాటి కృష్ణ, బాలయ్య, టీడీపీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

## ఘనంగా వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవం

**- నేడు జరగనున్న కలెక్టరేట్ ముట్టడికి వికలాంగులు హాజరు కావాలని పిలుపు**



**చిన్నగంజాం, ఆగస్టు 28, ప్రభాతవార్త**
మండలంలోని వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవం కార్యక్రమాన్ని వీహెచ్‌పీఎస్ జిల్లా కన్వీనర్ బాబురావు అధ్యక్షతన ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి బాపట్ల జిల్లా ఎమ్మార్పీఎస్ కన్వీనర్ చంద్రబోస్ మాదిగ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ మండల అధ్యక్షులు సైకం ఏడుకొండలు, వీహెచ్‌పీఎస్ జెండాను ఆవిష్కరించిన అనంతరం చంద్రోబస్ మాదిగ మాట్లాడుతూ వకలాంగులపెన్షన్ రూ.6వేలు పెంచాలని వారి న్యాయమైన డిమాండ్‌లు పరిష్కరించాలని కోరారు. గతంలో వికలాంగుల సమస్యలపై అన్ని జిల్లాల కలెక్టర్‌లకు ఎన్ని వినతి పత్రాలు ఇచ్చినా సమస్యల పరిష్కారం జరగకపోవడం అన్యాయం అన్నారు. వికలాంగుల సమస్యల ఆధనకై సోమవారం జరగబోవు కలెక్టరేట్ ముట్టడికి మండల వికలాంగులు భారీగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మండలంలోని వికలాంగులకు ఎలాంటి కష్టం వచ్చినా సమస్య వచ్చినా అండగా ఉంటే ఉపాధ్యాయులు సిద్దం నాగమల్లేశ్వరరావుకి ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ నాయకులు వెంకటేశ్వర్లు, అంకిరెడ్డిలు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు పరిశీలించిన సర్పంచ్ రాముయాదవ్



**దర్శి, ఆగష్టు 28, ప్రభాతవార్త**
దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇచ్చిన మాట ప్రకారం జరుగుతున్న అభివృద్ధి పనులను కొత్తపల్లి సర్పంచ్ బట్టు రాము యాదవ్ ఆదివారం పరిశీలించారు. గ్రామంలో సైడ్‌డ్రైన్స్, సీసీ రోడ్డు పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఇచ్చిన మాట ప్రకారం పనులు మొదలు పెట్టించిన ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్‌ని గ్రామంలోని ప్రజలు అభినందిస్తున్నారు.

## పుట్టువెంట్రుకల కార్యక్రమంలో మద్దిశెట్టి శ్రీధర్



**ముండ్లమూరు, ఆగష్టు 28, ప్రభాతవార్త**
అడిగొప్పలలో ముండ్లమూరు మండలం కొమ్మవరంకి చెందిన మేకల సీతారెడ్డి కుమారుడి పుట్టువెంట్రుకల కార్యక్రమానికి హాజరైన మద్దిశెట్టి శ్రీధర్. ఈ సందర్భంగా చిన్నారిని మద్దిశెట్టి శ్రీధర్ ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ రత్నరాజు, ఇంఛార్జి రాంబాబు, వైసీపీ నాయకులు ముత్తినీడి సాంబయ్యలు తదితరులు పాల్గొన్నారు.

## ముండ్లమూరు ఎంఈఓగా చంద్రమౌళి



**ముండ్లమూరు, ఆగష్టు 28, ప్రభాతవార్త**
ముండ్లమూరు మండల నూతన ఎంఈఓగా చంద్రమౌళి ఆదివారం నూతన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సుంకర సునీత బ్రహ్మానందరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. వీరితో పాటు బదిలీ అయిన ఎంఈఓ సాంబశివరావు, మండలంలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ చంద్రమౌళి మాట్లాడుతూ మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని పాఠశాలలో ఎలాంటి సమస్యలు వచ్చినా తమ దృష్టికి తీసుకొని రావాలని వెంటనే పరిష్కారం కోసం కృషి చేస్తానని ఆయన అన్నారు.

## లయన్స్‌క్లబ్ కమిటీ ప్రమాణ స్వీకారం



**దర్శి, ఆగష్టు 28, ప్రభాతవార్త**
లయన్స్‌క్లబ్ ఆఫ్ దర్శి టౌన్ 11వ ఇన్స్టలేషన్ ఫ్రోగ్రాంలో భాగంగా ప్రెసిడెంట్‌గా లయన్ నారపుశెట్టి మధుసూదనరావు, సెక్రటరీగా లయన్ పాపిశెట్టి సత్యనారాయణ, కోశాధికారిగా లయన్ సురేష్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో నూతలపాటి వీరప్రకాష్, నామినేని మోహన్‌రావు, వెలగ శరత్‌బాబు, వెంకట నగేష్‌లు పాల్గొన్నారు. వీరు లయన్స్‌క్లబ్ ఆఫ్ దర్శి ఎన్నో సేవా కార్యక్రమాలు చేసి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ప్రెసిడెంట్, సెక్రటరీ, కోశాధికారిచేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి మాజీ ప్రెసిడెంట్ అయిన కోటా హనుమంతరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో లయన్ రామాంజనేయులు, లయన్ పెద్దిరాజు, స్వాములు, విద్యాసాగర్‌రెడ్డి,బుడాటి ఆంజనేయులు,చావా శ్రీనివాసులు,మిగతా లయన్స్‌క్లబ్ మిత్రులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్యశిబిరంలో 180 మందికి వైద్య పరీక్షలు



**కొండపి, ఆగష్టు 28, ప్రభాతవార్త**
కొండపిలోని సాయిబాబా ఆలయంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో దాదాపు 180మందిరోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సంపూర్ణ శాస్త్ర సొసైటీ వారి హారిజన్ హాస్పిటల్ డాక్టర్ జోష్నతేజ వైద్య పరీక్షలు నిర్వహించి వారికి తగు సలహాలు, సూచనలతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యం కేవలం సహజసిద్ద ఆహారపు అలవాట్లు, సరైన ఆహారం, వ్యాయామం వలనే సాధ్యమవుతుందని డాక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా పలువురు రోగులకు ఆయుర్వేదం, నాచురోపతి, ఆక్యూపంక్చర్, ఎలక్ట్రోహోమియో ఫిజియోథెరపి వంటి అధునాతన, ప్రాచీన వైద్య విధానాల గురించి వారికి వివరించి తెలిపారు. ఈ వైద్య శిబిరంలో హోమియో ఆయుర్వేద మందులను వారికి పంపిణీ చేసి సహజసిద్దంగా వ్యాధులను ఏ విధంగా తగ్గించుకోవాలో వారికి సూచించారు. ఈ శిబిరంలో డాక్టర్‌తో పాటు హోమియో డాక్టర్ శ్రావణి, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

## మాలకొండరాయునిపాలెంలో ఘనంగా పోలేరమ్మ జాతర



**లింగసముద్రం, ఆగష్టు 28, ప్రభాతవార్త**
మండలంలోని మాలకొండరాయునిపాలెం గ్రామంలో పోలేరమ్మ జాతర వైభవంగా జరిగింది. ఆదివారం ఉదయం గ్రామంలో మహాలక్ష్మమ్మకు చద్ది ద్వారా నైవేద్యం చెల్లించిన భక్తులు సాయంత్రం పోలేరమ్మకు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురిసి పంటలు భాగా పండాలని, ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని గ్రామ దేవతను భక్తులు వేడుకున్నారు. ప్రతి ఏటా ఆగష్టు నెలలో జరిగే ఈ జాతర ఈ ఏడాది కూడా వైభవంగా గ్రామ పెద్దల సహకారంతో నిర్వహించారు. తమ కోర్కెలు తీర్చిన గ్రామ దేవతకు గ్రామస్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

## టీడీపి బలోపేతానికి ప్రతి ఒక్కరు కష్టపడాలి

**- ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలి**

**- బదుడే బాదుడు కార్యక్రమంలో టీడీపి నాయకులు**



**పొదిలిటౌన్,ప్రభాతవార్త**
టిడిపి నాయకులు,కార్యకర్తలు సమన్వయం తో పనిచేసి పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కష్టపడాలని మండల టిడిపి నాయకులు అన్నారు.ఆదివారం సాయంత్రం స్థానిక 11వ వార్డులో మాజీ ఎంపిటిసి డాక్టర్ సయ్యద్ ఇమాంసాహెబ్ ఆధ్వర్యంలో బాదుడే బాదుడు కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక్క అవకాశం ఇవ్వండి అంటూ అధికారంలోకి వచ్చి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రాన్నినాశనం చేశారని విమర్శించారు.జగన్ ప్రభుత్వంలో పెట్రోల్,డీజిల్,గ్యాస్,బస్ చార్జీలు,నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటాయన్నారు.సామాన్య ప్రజలు కనీసం కూటికి కూడా నోచుకోవడం లేదని ఆరోపించారు.నాడు ప్రజలపై ముద్దుల వర్షం కురిపించిన జగన్ నేడు ప్రజలపై గుద్దుల వర్షం కురిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు ప్రజల్లోకి తీసుకెళ్ళి ఎండగట్టాలని పిలుపునిచ్చారు.ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న జగన్ ప్రభుత్వానికి ప్రజలు రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు మీగడ ఓబులరెడ్డి,పట్టణ అధ్యక్షులు ముల్లా ఖుద్దూస్,మాజీ జడ్పిటిసి కాటూరి పెద్దబాబు,ఒంగోలు పార్లమెంట్ మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ రసూల్,మండల ప్రధాన కార్యదర్శి కాటూరి శ్రీనివాసులు,టిడిపి జిల్లా లీగల్‌సెల్ అధికార ప్రతినిధి షేక్ షబ్బీర్,ఒంగోలు పార్లమెంట్ మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి షేక్ యాసిన్,మండల మైనార్టీసెల్ అధ్యక్షులుఖల్‌నాయక్,ఎస్సీ సెల్ నాయకులుఠాగూర్ నాగేశ్వరరావు,ముల్లారబ్బానీ,ముల్లా షబ్బీర్‌బాష, పాశంనరసింహారావు,కొండయ్య,షేక్ మస్తాన్‌వలి,ఫాచ్చా,రఫి,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## కాలువలు ఆక్రమిస్తే కఠిన చర్యలు

**- మున్సిపల్ చైర్మన్ గఫూర్**

**కనిగిరి, ఆగష్టు 28, ప్రభాతవార్త**



మున్సిపల్ స్థలాలు, కాలువలు గాని ఆక్రమించి ప్రజలకు అంతరాయం కలుగచేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోబడతాయని మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫూర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని 3వ సచివాలయ పరిధిలో చైర్మన్, వార్డు కౌన్సిలర్ పర్యటించారు. హరిజనపాలెం ప్రాంత ప్రజల సమస్యలు చైర్మన్, కౌన్సిలర్ దృష్టికి తీసుకొచ్చారు. ఆక్రమణదారులు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, కాలువలు, ఖాళీ స్థలాలు ఆక్రమించి ప్రజలకు అంతరాయం లేదా ఇబ్బందులు కలుగజేస్తే వారిపై వెంటనే చట్టప్రకారం చర్యలు తీసుకుని ప్రజలకు ఇబ్బందులు లేకుండా పనిచేస్తామన్నారు. చైర్మన్ వెంట వైస్ చైర్మన్ మానిక్యరరావు, ఇంఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులు, వైసీపీ నాయకులు పెన్నా ఏడుకొండలు, నక్కా రామకృష్ణ, మూలే శ్రీనివాసరెడ్డి, సచివాలయ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం

**కనిగిరి, ఆగష్టు 28, ప్రభాతవార్త**



కనిగిరి దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవి దేవస్థానం గౌరవ అధ్యక్షులు దేవకి వెంకటేశ్వర్లు అన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం ఎన్నుకున్న తర్వాత ఆదివారం సాయంత్రం శ్రీ వాసవి కళ్యాణ్ సదన్ నందు నిర్వహించిన సమావేశం నందు దసరా నవరాత్రి ఉత్సవాలను ఎంతో ఘనంగా నిర్వహిస్తామని ఆయన తెలియజేశారు. అలాగే దేవస్థానం, శ్రీ వాసవి కళ్యాణ సదన్ కూడా ఆధునిక పద్దతులతో ఏర్పాటు చేస్తామని సమావేశంలో తెలియజేశారు. పై కార్యక్రమాలకు కనిగిరి పట్టణ ఆర్యవైశ్యులందరూ సహకరించాలని ఈ సందర్భంగా తెలియజేశారు. దసరా పండగను పురస్కరించుకుని సమావేశానికి విచ్చేసిన గౌరవ అద్యక్షులు ప్రత్యేక సలహాదారులు తగు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు దేవకి శ్రీనివాసులు, సెక్రటరీ కొలిపర్తి వెంకటస్వామి, కోశాధికారి బచ్చు రమేష్, సంయుక్త కార్యదర్శి ఓలేటి సుబ్బారావు, సంయుక్త కోశాధికారి నార్లపాటి మల్లిఖార్జునరావు, చెన్న సుబ్రహ్మణ్యం, తాళ్లూరి రమణయ్య, టంగుటూరి గోవిందరావు, వెలుగూరి చంద్ర, బాదం సత్యనారాయణ, కొలిపర్తి మారుతి కుమార్, చప్పరం వాసు, రాజపూడి వెంకటేశ్వర్లు, కొలిపర్తి వెంకటరత్నం, బొగ్గరపు సుందరరాజా, అంగుళూరు అనిల్‌కుమార్, సత్యాలు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



## విద్యుత్ సంస్కరణలను ప్రతిఘటించాల్సిన అవసరం ఉంది

**కనిగిరి, ఆగష్టు 28, ప్రభాతవార్త**

విద్యుత్ సంస్కరణలను ప్రతిఘటించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీఐటీయు జిల్లా కార్యదర్శి కేశవరావు తెలియజేశారు. విద్యుత్ అమర వీరుల సంస్కరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక సుందరయ్య భవనంలో విద్యుత్ అమరవీరులకు ఘనంగా నివాళ్లులర్పించారు. 2000లో జరిగిన ఉద్యమ పోరాటంలో ముగ్గురు అమరులైనారని వారి పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కేంద్ర విద్యుత్ రంగాన్ని ప్రైవేటు పరంచేసేందుకు చూస్తూ రాష్ట్రాల హక్కులను కాలరాస్తుంటే వ్యతిరేకించాల్సిన వైసీపీ ప్రభుత్వం మద్దతు తెలపడం దారుణమన్నారు. సంస్కరణల వలన విద్యుత్ చార్జీల భారం ప్రజలపై పడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కు తీసకొనే వరకు ప్రతి ఒక్కరూ పోరాడాల్సిన అవసరం ఉంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు నాయకులు కొండారెడ్డి, ఎస్టీ మీరావలి, సీత, ఖాదర్‌వలి, సీహెచ్ ప్రసాద్, ఓబయ్య, ఎస్‌కే కాశీంవలి, రాజేశ్వరి, నరేంద్ర, పద్మ, సుజాత, ఎస్ఎఫ్ఐ నాయకులు శ్రీనాథ్‌లు పాల్గొన్నారు.



## మహానేత వైఎస్సార్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

**- మంత్రులు, అతిరధమహారధులు రానున్న కార్యక్రమానికి విస్తృతంగా ఏర్పాట్లు గావిస్తున్న గంగసాని బృందం**

**పామూరు టౌన్, ఆగష్టు 28, ప్రభాతవార్త**



దివంగత ముఖ్యమంత్రి ఆంధ్రరాష్ట్ర ప్రజల ఆరాధ్యదైవం, రాష్ట్రంలో రామరాజ్య స్థాపన కొనసాగించిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని సెప్టెంబరు 2న మండలంలోని బొట్లగూడూరు గ్రామంలో ఆర్పాటు చేసిన మహానేత వైఎస్సార్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి విచ్చేయుచున్న అతిరధ మహ రధుల సభను విజయవంతం గావించాలని వైసీపీ మండల పార్టీ అధ్యక్షులు గంగసాని హుస్సేన్‌రెడ్డి, జడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, యువనేత, పామూరు ఉపసర్పంచ్ యాదాల సాయికిరణ , మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, మండల బూత్ కమిటీ అధ్యక్షులు గట్ల విజయభాస్కర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ షేక్ రషీద్‌లు కోరారు. ఒమేగా విద్యాసంస్థల అధినేత, వైసీపీ సీనియర్ నాయకులు కల్లూరి రామిరెడ్డి అధ్యక్షతన జరిగిన మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిద హోదాలో కలిగిన నాయకుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దిన మహానేత వైఎస్సార్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడం శుభపరిణామమన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, జిల్లా ఇంఛార్జి మంత్రి మేరుగ నాగార్జున, మాజీ మంత్రి, మూడు జిల్లాల కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి, జడ్పీచైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, కనిగిరి ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యులు, జిల్లా వైసీపీ అధ్యక్షులు బుర్రా మధుసూదన్ యాదవ్‌తో పాటు జిల్లా నలుమూలల నుండి వివిధ హోదాల్లో ఉండే నాయకులు హాజరయ్యే ఈ కార్యక్రమానికి మండలంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. రావణ రాజ్యం నుండి రాముడు రాజ్యాన్ని తీసుకువచ్చిన అపరభగీరధుడు, ఆరోగ్యశ్రీ ప్రదాత విద్యాదాత అయిన మహనీయుడు రాజశేఖర్‌రెడ్డిని ఆయన వర్ధంతి సందర్భంగా స్మరించుకోవడం మనం చేసుకున్న పూర్వ జన్మసు కృతంగా భావించాలన్నారు. పార్టీలకు అతీతంగా ఆరోగ్యశ్రీ ద్వారా అనేక సేవలు అందించిన ఘనత మహనీయుడు రాజశేఖర్‌రెడ్డికే దక్కుతుందన్నారు. విదేశాల్లో ఉచిత విద్యతో పాటు రాష్ట్రంలో విద్యనభ్యసిస్తున్న ప్రతి పేద విద్యార్థికి చేయూతనందించిన మహనీయుడిగా వైఎస్సార్‌ను కొనియాడారు. ఆ మహనీయుని కాలంలో రాష్ట్రంలో సస్యశ్యామలంగా వర్షాలు కురిసి అన్నదాతల పాలిట దైవస్వరూపుడిగా నిలిచారని అన్నారు. అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి నేడు ఆ సంక్షేమాలను ఆయన వారసుడిగా వైసీపీ ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డి కొనసాగించడం శుభపరిణామమన్నారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలే లక్ష్యంగా ముందుకు సాగుతూ ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను తిప్పికొడుతూ ప్రజా క్షేమమే ధ్యేయంగా ముందుకు సాగడం జగన్‌మోహన్‌రెడ్డి ఔన్నత్యానికి నిదర్శనంగా నిలుస్తుందన్నారు. దుష్టచతుష్టయంగా పేర్కొంటున్న కొన్ని పత్రికలు, ఛానెళ్లపనికట్టుకుని విషప్రయోగం చేస్తున్నారని అన్నారు. బొట్లగూడూరులో జరిగే విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని దిగ్విజయం చేసేందుకు వివిధ కమిటీలను ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా 5వేల మందికి భోజన సదుపాయం ఏర్పాటు చేసినట్లు గంగసాని హుస్సేన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతాంగ సమస్యలు పరిష్కరించాలి

**- రైతు సంఘం మండల 3వ మహాసభ డిమాండ్**






**నాగులుప్పలపాడు, ఆగష్టు 28, ప్రభాతవార్త**

రైతాంగ సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాగులుప్పలపాడు మండల మూడో సభ డిమాండ్ చేసింది. ఆదివారం ప్రజా సంఘాల కార్యాలయంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాగులుప్పలపాడు మండల మూడో మహాసభలో తీర్మాణించారు. ఈ సభకు రైతు సంఘం మండల ఉపాధ్యక్షులు దాసరి ఆంజనేయులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జయంతిబాబు మాట్లాడుతూ గతంలో రైతాంగ ఐక్య ఉద్యమం ద్వారానే మిర్చికి నీరు తెచ్చుకోవడం జరిగిందన్నారు. ఆన్‌లైన్‌సమస్యలతో రైతాంగం రుణాలు పొందలేక పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా మద్దతు ధర నష్టపరిహారం పంటల భీమా పొందాలంటే రైతులు ఐక్యంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రైతాంగం పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహారిస్తున్న నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా రైతులంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. తొలుత రైతాంగ ఉద్యమాల్లో మరణించిన వారికి ఆత్మహత్యలు చేసుకున్న రైతులకు 2000లో విద్యుత్ పోరాటంలో మరణించిన వారికి సంతాప తీర్మాణం ప్రవేశపెట్టారు. రైతు సంఘం మండల కార్యదర్శి జి.బసవపున్నయ్య కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా గుండ్లకమ్మ కాలువలో జంగిల్ క్లియరెన్స్ చేయాలని, రైతాంగం ఆన్‌లైన్ సమస్య పాస్ పుస్తకాల సమస్య పరిష్కరించాలని, వరి, మొక్కజొన్న, శనగ, అపరాలు తదితర పంటలను కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, గుండ్లకమ్మ కాలువ చివరి భూముల ముంపు సమస్యను పరిష్కరించాలని, మిర్చి రైతులకు ప్యాకేజీ అందించి ఆదుకోవాలన్నారు. ప్రైవేటు మిల్లర్ల నుండి ధాన్యం రైతులకు రావాల్సిన నగదును వెంటనే చెల్లించాలి, తదితర డిమాండ్‌లను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. అనంతరం రైతు సంఘం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా మారెళ్ళ వెంకటరావు, కాకాని సుబ్బారావు, కమిటీ సభ్యులుగా జే.జయంతిబాబు, దాసరి ఆంజనేయులు, ఆర్.నాగమల్లేశ్వరరావు, తాళ్ళూరి కృష్ణమూర్తి, గాదె నాగేశ్వరరావు, మొలకలపల్లి ప్రవీణ్, చెరుకూరి వాసు, ఘట్టమనేని బసవయ్య, కొల్లూరి రమణయ్య, సుబ్బారెడ్డి, కే.వీరాంజనేయులు, బండారుపల్లి వెంకట సుబ్బారావు, నడిపినేని కోటేశ్వరరావు, నార్నె చెంచయ్య, అంబటి శ్రీనివాసరావు, బెల్లం వెంకటరత్నం, పిన్నిక శ్రీను తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## బ్రతికుండగానే చనిపోయాడని జీవిత భీమా సంస్థ ద్వారా పొందిన డబ్బులు

**- సంబంధిత వ్యక్తి నేను బ్రతికే ఉన్నానని కార్యాలయానికి తెలిపిన వైనం**

**కనిగిరి రూరల్, ఆగష్టు 28, ప్రభాతవార్త**








మనిషి బ్రతికుండానే చనిపోయాడని మరణ ధృవీకరణ పత్రం ద్వారా కందుకూరు జీవిత భీమా సంస్థలో సంబంధిత నామిని అయిన రామన అరుణ డబ్బులు తీసుకోవడం జరిగింది. కానీ నేను బ్రతికే ఉన్నానని అసలు మనిషి జీవిత భీమా సంస్థ జోనల్ కార్యాలమైన హైదరాబాద్‌లో విజిలెన్స్ డిపార్టుమెంట్ వారికి లిఖతపూర్వకంగా ఇచ్చిన వైనం శనివారం వెలుగులోకి రావడం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. జీవిత భీమా సంస్థ డివిజనల్ ఆఫీస్ లీగల్ డిపార్టుమెంటు అధికారి అయిన బచ్చులి రమణకుమార్ మీడియా ద్వారా తెలియజేస్తూ వెలిగండ్ల మండలం కొటాలపల్లి గ్రామానికి చెందిన రామన నారాయణ గతంలో కనిగిరి జీవిత భీమా సంస్థ నందు పాలసీ తీసుకోవడం జరిగిందన్నారు. రెండు సంవత్సరాలు వాయిదా చెల్లించిన తరువాత పాలసీదారు అయిన నారాయణ కుటుంబ వివాదాలతో గ్రామం విడిచి వెళ్ళిపోవడం జరిగిందన్నారు. ఆ తరుణంలో పాలసీ ఆగిపోకూడదని కుటుంబ సభ్యులు వాయిదాలు కొనసాగించడం జరిగిందన్నారు. పిదప గ్రామంలో నుండి వెళ్ళిపోయిన నారాయణ తిరిగి రాడని గ్రహించిన కుటుంబ సభ్యులు కనిగిరి మండలంలోని చీర్లదిన్నె గ్రామంలో నారాయణ చనిపోయాడని కుటుంబ సభ్యులు మరణ ధృవీకరణ పత్రం చీర్లదిన్నె సచవాలయంలో తీసుకోవడం జరిగింది. తద్వారా సంబంధిత కార్యాలయ ఏజెంట్‌ను సంప్రదించి నామినికి డబ్బులు ఇప్పించమని ప్రాధేయపడడం జరిగింది. ఈ వ్యవహారం జరుగుతున్న తరుణంలో ఏజెంట్ విధి విధానాలు ఆలోచించకుండా వెలిగండ్ల మండలం కొటాలపల్లి గ్రామానికి చెందిన వ్యక్తికి కనిగిరి మండలం చీర్లదిన్నె సచివాలయంలో మరణ ధృవీకరణ పత్రం ఇవ్వడం ఏమిటి అనే ఆలోచనా విధానాన్ని ప్రక్కన పెట్టడం జరిగింది. ఏది ఏమైతే నాకేంటి అని తనదైన శైలిలో కార్యాలయ డాక్యుమెంట్స్ అన్నియు పూర్తి చేసి క్లబ్‌మెంబర్ షిప్ ద్వారా ఏజెంట్ సంతకం చేసి సంబంధిత డాక్యుమెంట్స్‌ను నామిని అయిన అరుణ ద్వారా కార్యాలయంలో పొందుపరచడం జరిగిందన్నారు. సంబంధిత కార్యాలయం వారు కూడా సొంత ఊరులోనే మరణ ధృవీకరణ పత్రం తీసుకోవాలి అనే విషయాన్ని పరిశీలించకుండా చీర్లదిన్నె గ్రామ సచివాలయం ద్వారా ఇచ్చిన మరణ ధృవీకరణ పత్రాలన్ని ఆధారంగా చేసుకొని నామిని ఖాతాకు డబ్బులు నెఫ్ట్ వేయడం జరిగింది. ఇటీవల కాలంలో అసలు వ్యక్తి అయిన రామన నారాయణ నేను బ్రతికే ఉన్నానని లిఖిత పూర్వకంగా హైదరాబాద్ జోనల్ ఆఫీస్ విజిలెన్స్ డిపార్టుమెంట్ వారికి తెలియజేయడం జరిగిందన్నారు. వారి ఆదేశానుసారం ముందుగా కొటాలపల్లి గ్రామాన్ని లీగల్ డిపార్టుమెంట్ అధికారి రమణకుమార్ సందర్శించి సంబంధిత వివరాలు కుటుంబ సభ్యుల నుండి తీసుకోవడం జరిగిందన్నారు. వెంటనే చీర్లదిన్నె గ్రామ సచివాలయం వెళ్ళగా పంచాయతీ కార్యదర్శి లేకపోగా ఆఫీస్ సిబ్బంది ఇచ్చిన కొద్దిపాటి సమాచారం తీసుకోవడం జరిగిందన్నారు. ఈ విషయమై చీర్లదిన్నె గ్రామానికి చెందిన కొప్పర్తి రోశయ్యను అడుగగా, పది నెలల క్రిందట బయట వ్యక్తులు మా గ్రామంలో చినపోలేదని వివరణ ఇవ్వడం కొసమెరుపు. ఈ సందర్భంగా లీగల్ డిపార్టుమెంట్ అధికారి రమణకుమార్ తెలియజేయుచూ సంబంధిత ఏజెంట్‌కు, చీర్లదిన్నె పంచాయతీ సెక్రటరీకి లీగల్ డిపార్టుమెంట్ ద్వారా నోటీసులు పంపించడం అతి త్వరలోనే జరుగుతుందన్నారు.

## వినాయక విగ్రహాలకు అనుమతి తప్పనిసరి

**- ఎస్సై ఎస్‌కే ఖాదర్‌భాషా**

**టంగుటూరు, ఆగష్టు 28, ప్రభాతవార్త**



మండల కేంద్రమైన టంగుటూరుతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేయనున్న వినాయక చవితి విగ్రహాలకు పోలీసు శాఖ నుండి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని, అలా తీసుకోని పక్షాన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోకున్నట్లు ఎస్సై ఎస్‌కే ఖాదర్‌భాషా తెలిపారు. అదే విధంగా వినాయక చవితి విగ్రహాలు ఏర్పాటు చేసుకునే వారు కమిటీగా వారు నిమజ్జనం వరకు కూడా బాధ్యతగా కమిటీ ఉండాలని తెలిపారు. విద్యుత్ శాఖ నుండి కూడా అనుమతి తీసుకోవాలని తెలిపారు. ఈ విధంగా ప్రతి రోజు స్టేషన్‌లో ఎస్సై శాంతి కమిటీలు ఏర్పాటు చేసి వారికి వినాయక విగ్రహాలకు సంబంధించిన ప్రభుత్వ చర్యలు, నిబంధనలను వివరించడం జరిగింది.

## 16వ వార్డు మెంబరు రసూల్ జన్మదిన వేడుకలు

**పామూరు టౌన్, ఆగష్టు 28, ప్రభాతవార్త**



వైసీపీ సీనియర్ నాయకులు, 16వ వార్డు మెంబరు స్వయంకృషి సేవా సంస్థ అధ్యక్షులు షేక్ కూటగుండ్ల నాయబ్‌రసూల్ జన్మదిన వేడుకలను స్థానిక వైసీపీ కార్యాలయంలో ఆదివారం నాడు ఘనంగా నిర్వమించారు. ఈ సందర్భంగా వైసీపీ మండల పార్టీ అధ్యక్షులు గంగసాని హుస్సేన్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీలో నిబద్దతతో పనిచేసి మండలంలో పార్టీ అభివృద్ధికి కృషిచేసిన నాయబ్‌రసూల్ నిండినూరేళ్లు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు చప్పిడి సుబ్బయ్య, యువనేత, పామూరు ఉపసర్పంచ్ యాదాల సాయికిరణ్, మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, ఒమేగా విద్యాసంస్థల అధినేత కల్లూరి రామిరెడ్డి, మాజీ ప్రధానోపాధ్యాయులు జొన్నలగడ్డ గోవిందయ్య పాల్గొన్నారు.

## హిందూ స్మశాన వాటిక అభివృద్ధి పనులు ప్రారంభం

**కనిగిరి, ఆగష్టు 28, ప్రభాతవార్త**



కనిగిరి స్వర్గదామం అభివృద్ధి పనులకు ప్రారంభం జరిగింది. స్మశాన వాటికలో అక్రమ కట్టడాలను తొలగించారు. ఎన్నో దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని ఈ కార్యక్రమం ఎట్టకేలకు ఆదివారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో కనిగిరి మున్సిపల్ చైర్మన్, అభివృద్ధి కమిటీ చైర్మన్ దేవకి సుబ్రహ్మణ్యం, మున్సిపల్ సిబ్బంది అక్రమ కట్టడాలను జేసీబీ సహాయంతో తొలగించారు. అద్దె ఇళ్లలో ఉంటూ చనిపోయిన వ్యక్తులను ఉంచేదానికి మున్సిపల్ నిధులతో భవన నిర్మాణాన్ని ప్రారంభించారు. త్వరలో శివుని విగ్రహం, చెట్లు నాటే కార్యక్రమం, దహన వాటిక నిర్మాణం, ఆస్థికల భద్రపరిచే గది, నిర్మాణాన్ని ప్రారంభిస్తామని అధ్యక్షులు దేవకి సుబ్రహ్మణ్యం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరి వెంకటేశ్వర్లు, అరుణోదర్, మాంటిసోరి, పిచ్చిరెడ్డి, బొగ్గరపు శ్రీనివాసులు, ముత్యాల శ్రీనివాసరెడ్డి, మహేష్‌రెడ్డి, రవీంద్ర, శ్రీరామ్ కృష్ణ, కొప్పురపు సత్యాలు, తడికమళ్ళ వెంకటేశ్వర్లు, మామిడి రమేష్, కంటు గురవయ్య, బాబురావు, రాజుగుండ్ల మోహన్‌రావు, నార్లపాటి మల్లిఖార్జునరావు, కోటరాజా తదితరులు పాల్గొన్నారు. త్వరలో కార్యవర్గ సభ్యులు అభివృద్ధి నిధుల కొరకు అందరి వద్దకు వస్తారని అందరూ సహకరించాలని కోరారు.

## వామ్ ప్రకాశం జిల్లా నూతన కార్యవర్గ సమావేశంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న శిద్దా లక్ష్మీపద్మావతి

**ప్రభాతవార్తప్రతినిధి, ఒంగోలు**

వేటపాలెం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం జిల్లా నూతన అద్యక్షునిగా ప్రమాణ స్వీకారంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహిళా గౌరవ అద్యక్షురాలు, ప్రకాశం జిల్లా అధ్యక్షురాలు శిద్దా లక్ష్మీపద్మాతి. ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ప్రకాశం



జిల్లా కార్యవర్గ సమావేశం వేటపాలెం శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా శిద్దా లక్ష్మీపద్మావతి మాట్లాడుతూ ఆర్యవైశ్యులందరూ వాసవి మాత ముద్దబిడ్డలని అన్నారు. అటువంటి ఆర్యవైశ్యులందరూ సేవాభావంతో, ఐక్యంగా ఉన్నప్పుడే



ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో విజయం సాధిస్తారని అన్నారు. ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగాలని ఆమె ఆకాంక్షించారు. నూతనంగా పదవి బాధ్యతలు తీసుకున్న వారికి ఆమె ఆశీస్సులు అందజేశారు. ఈ సందర్భంగా శిద్దా లక్ష్మీపద్మావతిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ గ్లోబల్ అధ్యక్షులు టంగుటూరి రామకృష్ణ, కార్యదర్శి ప్రదీప్, సభ్యులు ఉమామహేశ్వరరావు, మహేష్, ప్రకాశం జిల్లా నూతన అధ్యక్షులు మంచికంటి వెంకటేశ్వర్లు, వంక శ్రీనివాసరావు, ఆర్యవైశ్య మహిళలు, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ సభ్యులు పాల్గొన్నారు.

## ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మెగావైద్య శిబిరానికి విశేషస్పందన

**ప్రభాతవార్తప్రతినిధి, ఒంగోలు**

కొరిశపాడు మండలంలోని రవినూతలపాడు గ్రామంలో గల సాయిబాబా గుడి ప్రాంగణం వద్ద కీర్తిశేషులు చప్పిడి హనుమంతరావు పదో వర్ధంతి సందర్భంగా ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఒంగోలు వారిచే ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ డైరక్టర్, ప్రముఖ జాయింట్ రిప్లేస్‌మెంట్ అండ్ కి హోల్ సర్జరీ స్పెషలిస్టు డాక్టర్ ప్రకాష్ చవల మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో పేద మధ్య తరగతి ప్రజలకు కార్పోరేట్ స్థాయి వైద్య సేవలు అందించడమే ఉపాస్ సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్ లక్ష్యమని, చప్పిడి లలితమ్మ ఆధ్వర్యంలో రావినూతల గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించడం చాలా ఆనందంగా ఉందని, గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలు ఇటువంటి వైద్య శిబిరాలలోని వైద్య సేవలు వినియోగించుకోవాలని తెలియజేశారు. ఉపాస్ సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్ డైరక్టర్, ప్రముఖ ఊపిరితిత్తుల, శ్వాసకోశ వైద్యుల వైద్య నిపుణులు డాక్టర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ వర్షాకాలంలో మొదలయ్యే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేశారు. రావినూతల గ్రామ ప్రజలు వైద్య శిబిరంలో వైద్య సేవలు చక్కగా వినియోగించుకున్నారని, మెడికల్ క్యాంపు ను విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అతి త్వరలో కార్డియాలజి, కంటి వైద్యవిభాగం వైద్యసేవలు ప్రారంభిస్తున్నట్లు ఉపాస్ సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్ చీఫ్ జనరల్ మేనేజర్ సాతులూరి నరసింహమూర్తి తెలియజేశారు. ఉపాస్ సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్ నందు సిటిస్కాన్, అల్ట్రాసౌండ్, 2డీ ఎకో, డిజిటల్ ఎక్స్‌రే అత్యాధునిక వైద్య పరికరాలతో ల్యాబొరేటరి ఉన్నట్లు తెలియజేశారు. ఈ వైద్యశిబిరంలో 600మంది పేషెంట్లను పరీక్షించి, ఉచితంగా ఈసీజి, బీఎండీ, బీపీ, షుగర్ పరీక్షలు ఉచితంగా చేసి, మందులు ఉచితంగా అందజేశారు. ఈ వైద్యశిబిరంలో ప్రముఖ జనరల్ ఫిజిషియన్ డాక్టర్ ఆంజనేయులురెడ్డి, ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ జి.విజయలక్ష్మీ, డాక్టర్ మంజుషా, డాక్టర్ నవీన్, మార్కెటింగ్ మేనేజర్ ఖాశీం సైదా, ఏజీఎం కృష్ణ, క్యాంప్‌కో ఆర్డినేటర్ తాళ్లూరి ఆంజనేయులు, నర్సింగ్ సూపరింటెండెంట్ కామేష్ చందా, మార్కెటింగ్ ఎగ్జిక్యూటీవ్ షేక్ ఇస్లాం, హాస్పిటల్ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.







